ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం

రెండేళ్ల నుంచి అద్దె బకాయి..

- ఆగ్రహించిన యజమాని
- నిలిచిపోయిన వైద్య సేవలు
- అవస్థలు పడుతున్న కార్మికులు



మూత పడిన డిస్పెన్సరీ



ఆసుపత్రి గేటుకు తాళం వేస్తున్న యజమాని(ఫైల్)

జహీరాబాద్ టౌన్: కార్మికుల వైద్యం చేయాల్సిన స్థానిక ఈఎస్ఐ ఆసుపత్రి మూతపడింది. రెండు సంవత్సరాల నుంచి అద్దె చెల్లించడంలేదని భవన యాజమాని డిస్పెన్సరీకి తాళం వేశారు. దీంతో ఆరురోజుల నుంచి వైద్య సేవలు నిలిచిపోయాయి. అధిక సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వచ్చి బయటే ఎదురు చూసి వెనుతిరిగిపోతున్నారు. సిబ్బంది కూడా ఆసుపత్రి వద్ద సమయం గడిపి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఇప్పటి వరకు దీనిపై ఎవరూ పట్టించుకోకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో మహీంద్ర అండ్ మహీంద్రతో అధిక సంఖ్యలో పలు పరిశ్రమలు ఉన్నాయి. ఆయా కంపెనీల్లో సుమారు 5వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులకు వైద్య సేవలు అందించడానికి పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అయితే సొంత భవనం లేక డిస్పెన్సరీని దత్తగిరి కాలనీలోని ఓ అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి ప్రతిరోజు సుమారు 200మంది రోగులు వస్తుంటారు. అయితే గత ఆరు, ఏడు రోజుల నుంచి ఆసుపత్రి మూత పడడంతో రోగులకు వైద్య సేవలు అందడంలేదు. రోగులు పడుగాపులు పడి నిరాశతో వెళ్లిపోతున్నారు. బీపీ, షుగర్ ఇతర మందుల కోసం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఆసుపత్రి మూత పండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె చెల్లింపు విషయంలో ఈఎస్ఐ ఆసుపత్రి వారు మాట తప్పారని ఇంటి యాజమాని ఆరు రోజుల కిందట తాళం వేశారు. ప్రతినెల రూ.12.700 చెల్లించాల్సి ఉంది. దాని ప్రకారం జూన్ 2022 నుంచి సుమారు రూ.3లక్షల వరకు అద్దె బకాయి చెల్లించాల్సి ఉందని చెపుతున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

డిస్పెన్సరీ మూత పడడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రెండు, మూడు రోజుల నుంచి ఆసుపత్రికి వెళుతున్నా మూతపడి ఉంటుంది. డాక్టర్ అందుబాటులో ఉండడం లేదు. కనీసం మందులు కూడా ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి వెంటనే ఆసుపత్రి తెరిపించాలి

– చెన్నప్ప, కార్మికుడు, జహీరాబాద్

ఓపిక నశించి తాళం వేశా..

అద్దె విషయంలో ఈఎస్ఐ అధికారులకు చెప్పుకుంటూ వస్తున్నా. అగ్రిమెంట్ ప్రకారం ప్రతి మూడు నెలలకు ఓ సారి అద్దె చెల్లించాలి. కానీ రెండున్నర సంవత్సరాల నుంచి అద్దె డబ్బులు ఇవ్వడంలేదు. సుమారు రూ.3లక్షల వరకు అద్దె బకాయి ఉంది. ఓపిక నశించి తప్పని పరిస్థితిలో తాళం వేశాను.

–భరత్, ఇంటి యాజమాని

బిల్లు పాస్ కాలేదు

ఈఎస్ఐకి సంబంధించిన బిల్లులు పాస్ కాలేదు. అందు వల్ల అద్దె చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతోంది. డిస్పెన్సరీకి తాళం వేసి విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇంటి యాజమానితో మాట్లాడి త్వరలో ఆసుపత్రి తెరుస్తాం. అప్పటి వరకు రోగులను ఇతర ఆసుపత్రులకు పంపుతున్నాం.

–దశరథ్, ఆసుపత్రి అధికారి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మృతుడి భార్య రేణుకను ఓదారుస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదివారం సాయంత్రం పరామర్శించి ఓదార్చారు. మండలంలోని కొన్యాల గ్రామానికి చెందిన వడ్డే రమేష్ ప్రమాదంలో మృతి చెందడంతో మృతుడి భార్య రేణుకను, కుటుంబ సభ్యులను, అలాగే చందాపూర్ గ్రామానికి చెందిన చాకలి విష్ణు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరఫున కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ నర్సింహులు, ఎంపీటీసీ విట్టల్ రెడ్డి, పీఎస్‌సీఐ చైర్మన్ దామోదర్ రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా రుక్మిణీపాండురంగస్వామి శోభాయాత్ర



నిండు కలశాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని రుక్మిణి పాండురంగ ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. పాండురంగ నామస్మరణతో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు కలశాలతో గ్రామంలోని వివిధ వాడల గుండా ఊరేగింపుగా వచ్చి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, నాయకులు నాగరాజు, శ్రీనివాస్, సతీష్‌కుమార్, శ్రీనివాస్ కులకర్ణి, రాజేష్, వీరన్న పాటిల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎంపీ బీబీ పాటిల్ పాదయాత్ర



పాదయాత్రలో ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్: పట్టణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ పాదయాత్ర నిర్వహించారు. ఆదివారం శాంతినగర్‌లోని హనుమాన్ మందిరంలో పూజలు నిర్వహించారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, నారాయణనగర్, మహీంద్ర కాలనీల్లో ఆయన పర్యటించి తనకు ఓటువేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పాండురంగారెడ్డి, సుభాస్‌రెడ్డి, ఉమాకాంత్ పాటిల్, మల్లికార్జున్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో కష్టపడితేనే విజయం

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి

జహీరాబాద్: కార్యకర్తలు బూత్ స్థాయిలో కష్టపడి పనిచేస్తేనే విజయం సాధించగలమని కామారెడ్డి ఎమ్మెల్యే, జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి వెంకటరమణరెడ్డి అన్నారు. ఆదివారం జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన ఆయా పార్టీల కార్యకర్తలను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌లో మెజార్టీ ఓట్లు సాధించేలా పని చేయాలన్నారు. ఎంపీ బీబీపాటిల్ మాట్లాడుతూ అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డానన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లు అందజేస్తున్న శివరాజ్‌పాటిల్

సదాశివపేట(సంగారెడ్డి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆదివారం బసవేశ్వర మందిరంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శివరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్ విద్యాసాగర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ కోడూరి అంజయ్య, అక్బర్‌హుసేన్, అశ్వక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం



సప్తహంలో పాల్గొన్న భక్తులు

నారాయణఖేడ్: మండలంలోని చాప్టా(కె) హన్మాన్ ఆలయంలో వారం రోజులుగా నిర్వహించిన అఖండ హరినామ సప్తాహం ఆదివారంతో ముగిసింది. భజన మండలి సభ్యులు భజనలు, కీర్తనలతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంగమ్మసంగప్ప, చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఉత్సవ కమిటీ బాధ్యులు

నారాయణఖేడ్: అంబేడ్కర్ 113వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి వివిధ ప్రజా, దళితసంఘాల నాయకులు సమావేశమై ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా న్యాయవాది న్యాథెన్‌డ్యాని, అధ్యక్షుడుగా కొటారి నర్సింహులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సిద్దు, సంజయ్, కార్యదర్శులుగా అనుముల తుకారాం, పుండరీకం, సంజీవ్ కుమార్, శివాజీ, కమిటీ సభ్యులుగా రాజుకుమార్, లింగయ్య, పొట్టి ప్రవీణ్ కుమార్, రాఘునాథ్, పండరి, సతీష్, శంకర్, గాలి వినోద్, శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు. అంబేడ్కర్ జయంతి రోజున ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాధ్యులు కోరారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఆదివారం ప్రారంభించారు. స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు.

నిలిచిన భగీరథ నీటి సరఫరా



బోరు వద్ద గుమిగూడిన మహిళలు

- పైపులైన్ పగిలి అందని తాగునీరు
- 3రోజుల నుంచి ప్రజల అవస్థలు

జహీరాబాద్ టౌన్: మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో పట్టణంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా నీటి సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణానికి మిషన్ భగీరథ పథకం కింద సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా అవుతోంది. బుధేరా వద్ద పైపులైన్ పగిలి మూడు రోజుల నుంచి నీళ్ల సరఫరా కావడంలేదు. నీటి కోసం ప్రజలు బోర్ల వద్దకు వెళుతున్నారు. బిందెడు నీటి కోసం కాలనీ ప్రజలు నానాఅవస్థ పడుతున్నారు. పగిలిన పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పైపులైన్ మరమ్మతులు జరుగుతున్నాయని, సోమవారం నాటికి నీటి సరఫరా యథావిధిగా జరుగుతుందని చెప్పారు.

పక్కా ప్రణాళికతో ఎన్నికలకు వెళ్లండి

- కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సీఎం సూచన
- ఎంపీ అభ్యర్థి నీలం మధు



నీలం మధుతో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి చిత్రంలో మంత్రి సురేఖ

పటాన్‌చెరు టౌన్: తుక్కుగూడలో జరిగిన జన జాతర సభను విజయవంతం చేసిన స్ఫూర్తితో ప్రజలలోకి వెళ్లాలని, పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలసి సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

గెలిపించండి.. అండగా ఉంటా..

జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. జిన్నారంలో నిర్మాణంలో ఉన్న ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఆయనను కలిశారు. ఆలయ నిర్మాణంలో భాగస్వామి కావాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివాలయ నిర్మాణానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం నీలం ఆయనను సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆనంద్ చారి, రాజేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్‌చారి, పుట్టి భాస్కర్, శ్రీనివాస్, కావలి శేఖర్, బండి మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- రక్తదాన శిబిరానికి స్పందన



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: లయన్స్ క్లబ్ సభ్యుల సేవల ప్రశంసనీయమని ఎమ్మెల్యే, స్థానిక లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో రక్తనిల్వలు తగ్గిన క్లిష్ట పరిస్థితులను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాంతీయ ఆసుపత్రిలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించగా మంచి స్పందన వచ్చింది. 100 మంది రక్తాన్ని దానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రక్తదాతలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నెలలకు ఓసారి రక్తదానంచేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ రాజ్‌కుమార్, సీనియర్ సభ్యులు భోజిరెడ్డి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

కల్హేర్(నారాయణఖేడ్): మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం కల్హేర్, కృష్ణాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు వీర్‌షెట్టి, మల్‌దొడ్డి తుకారాం, మహిపాల్ రెడ్డి, యాదవరెడ్డి, వెంకట్‌రెడ్డి, బేగరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గీతం స్కాలర్ రాణికి పీహెచ్‌డీ



జపమాల రాణి

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో గణితశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని జపమాల రాణిని డాక్టరేట్ వరించింది. 'సాధారణీకరించిన కుంభాకారం ద్వారా విరామం– విలువ ప్రోగ్రామింగ్ సమస్యల అధ్యయనం'పై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. రేఖ సిద్ధాంత వ్యాసం, సర్వోత్తమీకరణం సమస్య అనిశ్చితి డేటాను పరిష్కరించడానికి సాంకేతికతలను ఆమె పరిచయం చేసిందని తెలిపారు. రాణిని అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రెజా తదితరులు అభినందించారు.

'సింగడి' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

జహీరాబాద్ టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రీయ కళామంచ్ సింగడి–2024 పోస్టర్‌ను ఏబీవీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ఆకాష్, ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న కళానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 21, 22 తేదీల్లో ఉస్మానియా యూనవర్శిటీ వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జహీరాబాద్ ప్రాంతం విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్, రాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

నారాయణఖేడ్: మండలంలోని జుజాల్‌పూర్ సమీపంలోని ఖేడ్ పట్టణ శివారులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఆమె వయస్సు 50 నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉంటుందన్నారు. వారం రోజులుగా ఆ మహిళ మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండగా స్థానికులు చూశారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 87126 56757, 87125 39061కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్



బహుమతులు అందజేస్తున్న కాట శ్రీనివాస్

పటాన్ చెరు: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ సాయి అంబికా కాలనీలో కాంగ్రెస్ పార్టీ జెనరల్ సెక్రటరీ రమేశ్ ఆధ్వర్యంలో మార్చ్ 23న ప్రారంభమైన స్పోర్ట్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో 12 జట్లు తలబడ్డాయి. అందులో ఆదివారం నిర్వహించిన ఫైనల్స్‌లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో సింధూ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు

- రోడ్లను వెడల్పు చేయాలని కోరుతున్న ప్రజలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పాత మున్సిపల్ కార్యాలయం సర్కిల్ వద్ద ట్రాఫిక్ పరిస్థితి

జిన్నారం(పటాన్‌చెరు): కాలనీల్లో ఏళ్ల కాలం నుంచి ఇరుకు రోడ్లు ఉన్నా వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. జనాభా పెరుగుతున్నా అందుకు అనుగుణంగా రోడ్లను మాత్రం వెడల్పు చేయడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో సుమారు 50వేల జనాభా ఉంటుంది. పారిశ్రామిక ప్రాంతం కావడంతో అన్ని వర్గాల ప్రజలు ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. ఏటా జనాభా పెరుగుతూనే ఉంది. మున్సిపల్ పరిధిలో 22వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డుల్లోని రోడ్లు ఇరుకుగానే ఉన్నాయి. వాహనాల రాకపోకల సంఖ్య ఎక్కువ ఉండడంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత మున్సిపల్ కార్యాలయ సర్కిల్‌లో నిత్యం ట్రాఫిక్ జాం అవుతుంటుంది. మియాపూర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ నుంచి బొల్లారానికి నిత్యం వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. దీనికి తోడు పారిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు కూడా ఇక్కడి నుంచే రాకపోకలు జరుపుతున్నాయి. సరిపడా రోడ్లు లేకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రమాదాలు కూడా తరచూ జరుగుతూనే ఉన్నాయి. తాజాగా కాలనీల్లో మిషన్‌భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్లకు రెండువైపులా పైప్‌లైన్ కోసం గుంతలు తీసి వదిలారు. రెండేళ్ల నుంచి ఈ పనులు జరుగుతూనే ఉన్నాయి. ఈ పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

మున్సిపల్ పరిధిలోని ప్రధానరోడ్లలో ఉదయం, సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. రోడ్లను మరింత వెడల్పు చేస్తే ట్రాఫిక్ సమస్య కొంత మేర పరిష్కారం అవుతుంది. – గంగాధర్, సీఐ బొల్లారం